రథసప్తమి

'ప్రభ'

[రథసప్తమినాడు సుధ మనోరథం పూలబాటలో నడిచింది. సూర్యుని రథాన్ని ఈ రోజునుండి వేగంగా నడిపిస్తాయి సూర్యుని సప్తాశ్వములూను. సూర్య ప్రీతికరమైన ఈ రోజున గృహలక్ష్ములంతా సూర్యుని పూజిస్తారు. నాస్తికుడైన సూర్యంకూడా ఆ రోజునుండి సూర్యప్రసాదంవల్ల భగవద్భక్తుడుగా మారిపోతాడు.]

రాధకి కడుపు చెరువైపోయింది సుధ సంగతి విన్నాక. పురుషులమీద నమిలిమింగేద్దామన్నంత కోపం వచ్చింది. పురుషులంతా ఇంతే అయితే లోకం శోకమయం అయిపోదూ! తన భర్తా అంతే. ఎప్పుడూ చిర్రూ బుస్సూ అంటూ ఉంటాడు. తను మాత్రం అతని మాటలేమీ లెక్కపెట్టుకోదు. కొండంత కోపంతో అరిచివెళ్ళినా మళ్ళా వచ్చేటప్పటికి, "ఏమండీ! భోజనానికి ఇంత ప్రొద్దుబోగొట్టుతున్నారు?" అంటూ నవ్వుతూ పలకరిస్తుంది.

చేతిలో కూరలసంచీ అందుకుని 'ఒక్కమాటు ఆ కుర్చీలో కూర్చోండి. నేను అన్నం వడ్డించి పిలుస్తాను' అని గబగబా వడ్డనజేసి సశేషం కోపాన్ని తగ్గించేస్తుంది చంద్రానికి రాధ.

ఆ శక్తి ఎందరు స్త్రీలకుంటుంది? పాపం సుధ అలాంటి నెరజాణ కాదు. సుధ ఆదర్శ మహిళా రత్నం అనవచ్చు. తన ఆదర్శాలన్నీ సక్రమంగా నెరవేర్చుకుంటుంది. సుగుణాలన్నీ ఆమెలో మూర్తీభవించాయి. నెరజాణ కాకపోయినా తెలివితక్కువది మాత్రం కాదు సుధ. ఎటుచూసినా ఆమెలో లోపం భర్తను తనవశం చేసుగోలేకపోవడం ఒక్కటే.

సుధ తెలివితక్కువదిగా చిన్నప్పటినుండి పరిగణింపబడలేదు గాని భర్తదగ్గిర మాత్రం ఏమివినియోగపడ్డంలేదు ఆమె తెలివితేటలు. ఆమెకే భర్తను మెప్పించే తెలివితేటలు ఉంటే ఆమె చేసేపని ఏదైనాసరే విఘ్నేశ్వర పూజలేని దండుకాతుంది.

భావగర్భితములైన ఆమె చర్యలు ఈలోకం దృష్టిలోనూ భర్త దృష్టిలోనూకూడా అవకతవకగా ఉండవచ్చు. అంత మాత్రంచేత సుధను పట్టి దద్దమ్మగా కట్టిన భర్త మాత్రం ఏమంత సరసుడు?

సుధయొక్క సున్నితమైన హృదయపుష్పం కర్కశ హస్తాల్లో నలిగిపోదగింది మాత్రం కాదు.

అలాంటి సుధ బాధలు పడుతోందంటే పూర్వజన్మకర్మ ఉందని ఒప్పుకు తీరాలి.

2

చంద్రం రాగానే కాళ్ళు గడుక్కోమని నీళ్ళు ఇచ్చి కాఫీ టిఫినూ ఇచ్చి సాయంత్రం వంట అయింది గనుక తీరుబడిగా కూర్చుంది చంద్రం కూర్చున్న వాలు కుర్చీ పక్కగా రాధ.

చంద్రం ఏదో మాట్లాడుతున్నాడు రాధతో. మాట్లాడుతూ రాధ మొహం కళావిహీనంగా ఉండడం గమనించాడు. "రాధా! ఎప్పుడూ లేదు ఇవాళ నీ ముఖం వాడిపోయిందేం! నేను కోప్పడ్డానని కాదుగదా?" అన్నాడు.

"అబ్బే! మీరు కోప్పడ్డం, మీరు ప్రేమించడం సామామూలే. మీ కోపం ఎంతసేపు! మీ ప్రేమ ఎంతసేపు! మెరుపుతీగలాంటిదే మీ కోపం; అదేం

కాదండీ? ఇవాళేమో తోచడంలేదు" అన్నది రాధ.

"మరి ఎందుకలా వున్నావు! చెప్పకపోతే వీల్లేదు-చెప్పితీరాలి" అన్నాడు చంద్రం.

రాధ హైస్కూలు చదువు పూర్తిచేసింది. తరువాత పద్యగద్య కావ్యాలన్నీ చదివింది. మహిళా సమాజంలో ఉపన్యాసాలిచ్చి మెప్పుపొందింది. స్త్రీల సభలకు అధ్యక్షురాలు రాధే.

భర్త సరదాగా ఉన్నప్పుడు విద్యా విషయమైన వాదనవస్తే పైచెయ్యి రాధదే. నిన్ను లాయరుగా తయారుచేస్తే బాగా వాదిస్తావు రాధా? అంటాడు చంద్రం తన ఓటమి ఒప్పుగుంటూ. రాధ సునిశితమైన బుద్ధికి తెలివికి తనలో ఆనందపడుతూంటాడు. మంచి పుస్తకాలు తెచ్చిఇచ్చి రాధ విజ్ఞానాన్ని పెంపొందిస్తూంటాడు. వంటింట్లో నాలుగు గోడల మధ్యా ఉండే స్త్రీలకు చదువూ సంస్కారం ఎందుకు! అనే వాళ్ల జాపితాలో చేరడు చంద్రం. ఇన్ని సద్గుణాలుఉన్నా కోపంవచ్చినప్పుడు మాత్రం మనిషి గాడు. అతనికి కోపం కారణం లేకుండానే వస్తుంది. ఆ కోపం ఆట్టేసేపు ఉండదు. చంద్రం కేకలకూ బొబ్బలకూ సుధ అయితే హడిలిపోతుంది. రాధ చంద్రం ఎంత పెద్దకేక వేస్తే అంత నవ్వుతాలుగా తీసుకుంటుంది.

చంద్రం ముక్తసరి మనిషి అయినా రాధ స్వభావం అతన్ని వాచాలుణ్ణిగా చేసింది. గుటకలు మ్రింగని చంద్రం నోరూరిపోతుంది – రాధనిబట్టి రాధ బలే చమత్కారి. మంచి వక్తకూడాను. అంత ధైర్యశాలిగనకే చంద్రంతో ఆట్టే గొడవరాదు రాధకి.

ఏం రాధా? మౌనంగా కూర్చున్నావు? ఏమిటి ఆలోచిస్తున్నావ్? "ఆ! ఏం లేదు సుధ విషయం ఆలోచిస్తున్నా.

"ఏమిటి జరిగింది."

రాధకి ఆవేశం ఎక్కువైంది. "సుధ భర్త సూర్యం స్వభావం మీరు ఎరుగుదురా!"

"ఏమో నాకు తెలీదు. ఏం అలా అంటున్నావ్"

"చెప్తా వినండి. పురుషులే స్వేచ్ఛా జీవులు. వారికి ఎవ్వరూ మంచిచెప్పే హక్కులేదు; భార్య ఏమి చెప్పగలదు!"

"ఏం! ఆడవాళ్ళు ఎందుకు చెప్పలేరు. స్త్రీ స్వాతంత్ర్యంపెరుగుతోందిగా! అసలేమిటి చెబుదూ."

"పురుషులు దయతలచి స్వాతంత్ర్యం ఇస్తే పెరుగుతోంది లేకపోతే తరుగుతోంది."

దేశస్వాతంత్ర్యంవంటిగొప్ప ఉద్యమమున్నా మహాత్ముడు సాధించేడుగాని స్త్రీ స్వాతంత్ర్యం మాత్రం ఏ మహాత్ముడు సాధించలేకపోయాడు.

అసలు కీలకం ఎక్కడుందంటే ఆర్థికంగా భర్త పోషించినన్నాళ్ళు ఏ స్త్రీకి ఇడుములు తప్పవు. అందుకే స్త్రీస్వాతంత్ర్యం స్త్రీ విద్యతోగాని రాదు. కొంతమంది పురుషులు భార్య పేరంటం వెళ్లడమంటే ఇష్టపడరు. భార్య వీధి గుమ్మంలో నించోడం ఇష్టం ఉండదు కొందరికి. సూర్యానికి ఇంకో దుర్గుణం కూడా ఉంది.

సుధకి పూజా పునస్కారం చేసుగోడం అంటే ఆసక్తి. సూర్యానికి అది కిట్టదు. "భర్త సేవచేస్తే స్త్రీ తరిస్తుంది" ఇంకేమీ అక్కర్లేదంటాడు. అసలు సూర్యానికి దైవం ఉన్నాడంటే నమ్మకంలేదు. అందుకే సుధ దైవారాధన తలపెట్టిందంటే ఏదో అవాంతరం కల్పించి తీరుతాడు.

జీవితంలోసాగే ప్రతి చిన్న విషయానికీ, అంటే దైనందిన చర్యల్లో భర్తకూ తనకూ కలిగిన భేదాభిప్రాయాల గురించి చాలా బాధపడుతుంది సుధ. నిత్యం ఏదో ఒకదాన్ని పురస్కరించుకుని మనస్సు పాడుచేసుగోడం సుధకు అలవాటైంది.

ఆ విషయమే తలుచుకు తలుచుకు మరిచిపోలేక సీరియస్‌గా తీసుగునే మనస్తత్వం సుధది.

'లక్కంటే లక్కి' అంటాడేగాని భార్యపడే బాధ రవ్వంతైనా పట్టించుగోడు సూర్యం. ఎంత

గడ్డు సమస్యలు ఎదుర్కొన్నా దూదిపింజ తేలిగ్గా ఎగరకొట్టేవాడిలా దులబరించుకు తిరిగే స్వభావం సూర్యానిది.

ఇలా విభిన్న తత్వాలుగల దంపతులున్నారంటే, ఇంక ఆ యిల్లు ... ...

ఆ! ఇంక ఆ యిల్లు ఎలా ఉంటుందో చెప్పమంటారా? ఏం మీకు తెలియదా! నా చేతే చెప్పించాల్లనా? ఓహోహో! పాపం! మీకు క్రొత్తగా ఉందనుకుంటా?

మీరూ అంతేగా! అలాటి ఇల్లూ ... చెప్పమంటారా? అంతకంటె నరకమే నయం. ఏం. ఔనంటారా? మాట్లాడరేం!

మనింట్లో గొడవరాదేమంటారా! ఎలావస్తుంది? శివుడు హాలాహాలాన్ని కంఠంలో దాచుకున్నట్లు మీ పేచీలన్నీ నేను కడుపులోనే దాచుకుంటాను. నేనన్నదానికి ఎప్పుడూ మీరు సమ్మతించరు. నేను కాదంటే మీరు ఔనంటారు.

బిచ్చగాడికి వేసే భిక్షంకూడా నేను వేస్తూంటే మీరు వద్దని తీరుతారు. నేను పొమ్మంటే, వద్దూ, మనం ఏమీకట్టుకుపోం అంటారు. నేను మొండి మనిషిని గనుక మీతో వేగుతున్నాను. నేను సరిపుచ్చుకుపోయే మనిషిని.

మరి అంతా అలాగే సరిపుచ్చుకోవాలంటారా? నిజమే! కాని సుధ అలా సరిపుచ్చుకోలేదు. సూర్యం మరీ అన్యాయంలెండి. అతనితో చెప్పకుండా ఏ పనీచెయ్యడానికి వీల్లేదుట. సోలెడు బియ్యం అప్పుతేవాలంటే అతనితో చెప్పకపోతే ఆ రోజు గొడవే."

3

రాధ ఇంకా చెప్పుకుపోతోంది. నేనలాగే వింటూ కూర్చున్నాను రాధ ఉపన్యాస ధోరణి.

మళ్ళా మొదలుపెట్టింది రాధ ఎందుకో వంట ఇంట్లోకి వెళ్లివచ్చి.

సుధ రేపు రథసప్తమి పాలు పొంగించుకోవాలని పని మనిషితో బెల్లం వగైరా తెమ్మని చెపుతూంటే సూర్యం ఇంటికి వచ్చాట్ట.

"రేపు అదంతా యేంమొదలు పెట్టకు, రేపు నేనూరికి వెళ్ళాలి. నీవు పొద్దున్న ఎనిమిదీ గంటలకే వంట చెయ్యాలి అన్నాట్ట". వట్టి బూటకం. ఎప్పుడూ ఏదో సాకుచెప్పి సుధ చేసేపనికాస్తా మానిపిస్తాట్ట.

తరువాత "ఇవాళ ప్రయాణంలేదు" అంటాట్ట ఇంతకుముందే మనింటికొచ్చి నాతో చెప్పి చాలా బాధపడింది సుధ.

"ఏమిటో! పుణ్యంకొద్దీ పురుషుడూ దానంకొద్దీ బిడ్డలూను" అంటూ బాధగా నిట్టూర్చింది రాధ.

"ఏమిటా విచారం రాధా. నువ్వే సుధవై పోతున్నావ్. కొంచెం శాంతం అలవరుచుకోవాలి ఆడాళ్లు అన్నాడు" చంద్రం.

"ఏమిటీ! శాంతం అలవర్చుగోవలెనా! అవును మరి అలాకాక ఇంకెలా చెబుతారు. మగవాళ్లంతా ఒకటే.

శాంతంలేక ఆడది చేసేదేముంది? శాంతం పరిధి ఎంతవరకు? ప్రతిదానికీ మగవాడు అడ్డుచెపుతుంటే ఆడది బాధపడక ఏంచెయ్యగలదు చెప్పండి? సుధకి దైవభక్తి మెండు. సుధలాంటివాళ్ళని నాస్తికుల్లా కూచోమంటే ఎలా కూచోగలరు!

సుధ నాకు సాక్షాత్తూ మేనత్తకూతురాయె. బాధగా ఉండడం తప్పా-మీరే చెప్పండి. అయినా సుధ చాలా మంచి మనిషి,

భార్యాభర్తలిద్దర్లోనూ ఒకరైనా సర్దుకుపోయే వాళ్లయితేగాని సంసార శకటం సమంగా నడవదు. మొన్న మనం ఈ ఇంట్లోకి అద్దెకు వచ్చేటప్పుడు నేను ఇంత ఇల్లెందుకంటే విన్నారా! డబ్బుకు డబ్బా ఎక్కువే. ఒకరోజు పనిమనిషి రాకపోతే

నేను ఒక్కదాన్ని ఊడ్చుకోడంకూడా చాలా కష్టం ఇల్లంతా.

"పెద్ద ఇల్లైతేం! నౌకర్లచేత చేయించుకో" అన్నారాయె! మహా ఇంటినిండా నౌకర్లుపడున్నట్లు.

"ఇంకోమాటు ఆ మాటన్నారంటే నేనూన్నా గా! ఇంట్లో పెద్ద పాలికాపుని ఆజ్ఞాపించు, ఆ పన్లేవో నేనే చేస్తా" నంటారాయె. నా మాటఒక్కటి సాగనివ్వరు, సంగతి చెప్పాను. నేను బాధపడేదాన్ని కాదులెండి, ఎలాంటి పరిస్థితిలోనూ" అంది రాధ.

"ఔను మరి నువ్వు దాసీదాన్ని నేనన్నాగా. అంటే నేనేమనాలో నువ్వే చెప్పు రాధా?" చంద్రం అన్నాడు.

"భిన్న ప్రకృతులు మానవ సహజం. ఒకరినొకరు అర్థంచేసుకుని సరిపెట్టుకుంటే పోతుంది. అలా కాకుండా పట్టుదల్లో పట్టుగుని వ్యవహరిస్తే నిజానికి దంపతుల్లో ఎవరిపంతమూ నెగ్గదనే చెప్పాలి. పురుషుని అధికారం పేరుకి మాత్రమే.

స్త్రీ పురుషునికి లొంగక తప్పదని నేను ఒప్పుకుంటాను. కాని మనిషిలొంగినా విధిలేక స్త్రీమనస్సు ఎంతఘటికుడైనా లొంగదీయడం అసాధ్యం."

"తృప్తిగా, మనస్ఫూర్తిగా లేని కాపురాలు పాలులేని పాయసంలా ఉంటాయి."

"నీ ఉపన్యాసం చాలించుగాని, రేపు పాలు పొంగిస్తావా" చంద్రం అన్నాడు.

"పొంగిస్తాగాని రేపు సుధని దాని భర్తని మనింటికి భోజనానికి పిలుద్దాం. మీరు పిలిస్తే సూర్యం మనింటికి రానండు. రథసప్తమినాడు పాలు పొంగించుగోవాలని ఉత్సాహంతో ఉన్న సుధ నాతో పాటే సూర్యనారాయణమూర్తిని సేవించుకుంటుంది. ఏం, ఏమంటారు?" సమాధానంకోసం తొందర పెట్టింది రాధ.

"సరే, పిలుద్దాం! ప్రొద్దున్నే పిలుస్తాను. నువ్వన్నది కాదంటే నేనూ సూర్యాన్నే అయి ఊరుకుంటా నేమో!"

"అబ్బే కాదండీ మీరు చాలా మంచివారు సరేనా?" సైరుపోసింది రాధ.

"ఓ! మహా ఇల్లాలువు. సీతా సావిత్రి మొదలైన భారత నారీమణుల అంశవల్ల జన్మించావు. నీలాంటి సాధ్వీమణుల పుట్టుకచేతనే భారతదేశం అన్ని దేశాలకన్న మిన్న అనిపించుకుంటోంది," చంద్రం నవ్వుతూ అన్నాడు.

అది సరేగాని చెప్పేది వినండి, "ప్రొద్దున్న పది గంటలకు వాళ్లు మనింటికి వస్తారు. అప్పుడు సుధా నేను కలిసి పాలుపొంగించుగుంటాం, ఈ సంగతి సుధతో చెప్పానులెండి" అంది రాధ

4

మర్నాడు రథసప్తమి, రాధ పూజాద్రవ్యములన్ని సిద్ధంచేసి వంట పూర్తికానిచ్చి సుధకోసం కనిపెట్టుకూర్చుంది. సుధా సూర్యం లక్ష్మీనారాయణుల్లా పీతాంబరధారులై వచ్చారు. లోకంపోకడ తెలియని సూర్యం లోభిగనుక భోజనానికి పిలుస్తేచాలు ఖర్చు తప్పిందని సంతోషించాడు.

ఇలాంటి పర్వదినం ఇంట్లో పూజాదేవతార్చనా లేకుండా పైచోటికి రావడం చెప్పరానంత బాధగా ఉంది సుధకి. లోపలే అణచుకుంది సుధ తన బాధ. రాధ రమ్మని పట్టుబట్టిందని దైవారాధన చేసుకో వచ్చునని ఎలాగో తృప్తిపడింది.

భర్తచేసిన తిరస్కారం తలుచుగుంటే సుధకి గుండెల్లో గతుక్కుమంటోంది. ప్రయత్నపూర్వకంగా సంతోషాన్ని కనబరుస్తోంది స్త్రీస్వాతంత్ర్యానికి నోచుకోని సుధ. రాధా చంద్రం సుధని సూర్యాన్ని ఆహ్వానించారు. సుధ మొహం చూడగానే పోల్చుకుంది రాధ. ఆమె కళ్లల్లో ప్రతిఫలిస్తున్న దీనత్వంచూసి బాధతో కృంగిపోయింది. "పాపం సుధ చాలా అమాయకురాలు" అనుకుంది..

"సుధా! నువ్వూ నేనూకూడా మా ఇంట్లోనే ఇవాళ పూజాదికములు కానిద్దాం" అంది రాధ.

సుధ నవ్వింది వెలవెలగా. సూర్యం తలవంచేసుకున్నాడు. అతనికి తలకొట్టేసినట్లైంది. ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు, సుధ లోపలికి వెళ్ళింది.

కొంతసేపటికి "సూర్యం వడ్డనైంది రావోయ్" అంటూ, చంద్రం పట్టుపంచ కట్టుకుంటూ వచ్చి పిలిచాడు. సూర్యం వంటగదిలోకి వెళ్ళేటప్పటికి సుధ నీరాంజనంతో సహా తులసెమ్మ దగ్గరనుంచి భర్త దగ్గరకు వచ్చింది.

సూర్యం చంద్రంతో పాటు బలవంతాన హారతి కళ్ళకద్దుకున్నాడు. జారుముడిలో తొంగిచూస్తున్న గులాబీపువ్వు సుధ చెక్కిళ్ళ ఎరుపుతో కలిసిపోయింది! ఆమె ఆనందంతో నవ్వుతూంటే ఆమె నవ్వు పళ్ళెంలో ఉన్న మల్లెపూలని పరిహసిస్తోంది. సూర్యం చంద్రం భోజనాలకు కూర్చున్నారు. రాధ వాళ్ళిద్దరికీ వడ్డనచేస్తోంది. సుధకూడా వడ్డనకు సాయపడింది పాయసం పాత్రతో వచ్చి.

"సుధా! సూర్యానికి పరమాన్నం ఇష్టమేనా? సూర్య భగవాన్లుకు పరమాన్నం ప్రీతి అంటారు" వ్యంగ్యంగా అంది రాధ.

"వీరికీ ఇష్టమే! వీరు ప్రత్యక్ష దైవం మనకి" అంది సుధ నవ్వుతూ.

సుధ భావాన్ని గ్రహించి చంద్రం, "సూర్యనారాయణమూర్తే ఇవాళ మా యింటికి వచ్చాడు" అన్నాడు భక్తి ఉట్టిపడేలా.

"సుధా మీరూగూడా పండితులే" భర్తతో రాధ ఇలా అని "సుధా! నీ పేరు ఉపాదేవైతే ఇంకా బాగుంటుంది గదూ! అంది."

"నీ పాండిత్యం మాత్రం తక్కువా?" అన్నాడు చంద్రం నవ్వుతూ.

"ఔ నన్నయ్యా మా ఒదినా పండితురాలే!" అంది సుధ.

ఆ క్షణంలో అందరి నవ్వులూ కలిసిపోయాయి భోజనాల దగ్గర. సూర్యం మౌనంగా చిన్న నవ్వు నవ్వేడు తలయెత్తకుండానే.

భోజనాలైనాక తాంబూలాలు వేసుకున్నారు దంపతీద్వయం. చల్లబాటువేళదాకా పిచ్చాపాటీ చెప్పుకుంటూ కూర్చున్నారు. తరువాత సుధా సూర్యం ఇంటికి వెళ్ళిపోయారు.

"సుధా! ఇవాళ ఎంత ఉల్లాసంగా ఉన్నావ్. నీరాంజనం తీసుకొస్తూంటే నిజంగా నిన్ను చూస్తే భక్తమీరాబాయి జ్ఞాపకంవచ్చింది. పూజలన్నా దేవుళ్ళన్నా నీకెంత సంతోషం? ఇన్నాళ్ళనుండీ తెలుసుకోలేకపోయాను. నీ సంతోషాన్ని భగ్నంచేసాను. నాస్తికుణ్ణి, నన్ను క్షమిస్తావా సుధా! నీరాంజనం కళ్ళకద్దుకున్నాక నా హృదయం ప్రక్షాళితమైంది. ఇప్పుడు నామనస్సు అలలులేని సముద్రంలా నిర్మలంగా ఉంది. పశ్చాత్తాపంపొందిన నాకెవరో చేయూతనిచ్చినట్లు ధైర్యంగావుంది.

దైవారాధనవల్ల ఎంత సంతృప్తి ఎంత ఆనందం ఉందో ఇప్పుడు కొంచెంతెలుసుకున్నాను. నీతోపాటు నేనుకూడా భగవంతుణ్ణి నమ్ముకుని ఎన్ని బాధలువచ్చినా ఎదిర్చేశక్తి సంపాదించాలని ఉంది సుధా! సూర్యనారాయణమూర్తి అనుగ్రహమే కాని నా హృదయపరివర్తనానికి ఇంకోకారణం ఏమీలేదు.

ఇప్పుడు నేనుకూడా భగవధ్యానంచేసుకుంటూ భగవద్భక్తితో ఆనందతరంగితమైన నీ ముఖకమలం చూస్తూ జీవితం గడపాలని ఉంది నమ్ముతావా సుధా?" అన్నాడు సూర్యం.

సుధ సంతోషానికి మేరలేదు. సుకుమారంగా సన్నని వేళ్ళతో ఉన్న చేతులతో భర్త పాదాలంటి నమస్కారం చేసింది.

"ధన్యురాల్ని ఈ నాటికి నా దైవానికి నామీద అనుగ్రహం కలిగింది" అంటూంటే సుధకళ్ళల్లోంచి ఆనందబాష్పాలు జారి సూర్యం పాదాలను తడిపేయి.

—o—